
# ఆకాశరామన్న



నారాయణ చూడడానికి పెద్ద మనిషిలాగానే ఉంటాడు.

సాటి ఉద్యోగులందరితోనూ ఎంతో చనువుగా ఉంటాడు. ఎటొచ్చీ... అతనికున్న ముఖ్యమైన దుర్గుణం- ఇతరుల మీద పై అధికారులకు 'ఆకాశరామన్న ఉత్తరాలు' రాయడం!

ఎవరైనా ఘోరమైన తప్పిదాలు చేసి, ప్రభుత్వాన్ని మోసగించి కూడా పలుకుబడితో వాటిని పైకి రానియ్యకుండా చూసుకుంటుంటే- అలాంటి విషయాలను పై అధికారుల

దృష్టికి 'ఆకాశరామన్న' ఉత్తరాల ద్వారా తీసుకువస్తే అందులో కొంత అర్థం ఉంది. కాని, చిన్నచిన్న లోటుపాట్లకి, కేవలం తనకి గిట్టనివారిమీద ఆ విధమైన ఉత్తరాలు రాయడం మాత్రం క్షమించరాని నేరం!

తాను రాసిన ఉత్తరాల ఆధారంగా ఆఫీసర్లు వచ్చి విచారణ జరుపుతుంటే, అది చూసి ఎంతో ఆనందించేవాడు. సాటి ఉద్యోగులు ఈ విచారణలవల్ల ఆందోళన పడుతుంటే అది తనకొక విజయంగా భావించుకునేవాడు నారాయణ.

మొదట్లో ఈ 'ఆకాశరామన్న ఉత్తరాలు' ఎవరు రాస్తున్నారో ఎవరికీ అర్థంకాలేదు. కాని, క్రమేపీ నారాయణ చూపిస్తున్న కుతూహలం చూసి, అతనికి అందరికంటే ముందే ఎవరికీ తెలియని సమాచారాలు తెస్తుండడం చూసీ... ఈ 'ఆకాశరామన్న' ఎవరో అందరికీ అర్థమయిపోయింది. అయితే... తగిన సాక్ష్యాధారాలు లేనిదే ఎవరూ ఏమీ చెయ్యలేరు కనుక, పైకిమాత్రం- ఎవరూ ఏమీ అనలేకపోయారు. 'ఎప్పటికైనా పాపం పండదా...' అని సమయం కోసం వేచి చూస్తూండసాగారు.

ఒకరోజున నారాయణపై అధికారి మీద, ఆయన పై అధికారికి ఒక 'ఆకాశరామన్న ఉత్తరం' అందింది. అందులో నారాయణ ఎన్నో తప్పిదాలు చేస్తున్నా కూడా, అతని పై అధికారి ఏమీ చర్య తీసుకోవడం లేదనీ, ఇద్దరి మధ్య ఏదో లాలూచీ ఉందనీ రాసి ఉంది.

ఆయనవెంటనే తన క్రింది అధికారికి ఉత్తరం పంపుతూ దానిపై ఆయన సంజాయిషీ కోరాడు. అదిచూసి రుద్రుడయ్యాడు ఆ అధికారి. అసలు సంగతేమిటో తేల్చుకుందామని అకస్మాత్తుగా వచ్చి నారాయణ డ్రాయర్లు తనిఖీ చేశాడు ఆయన.

అందులో ఎన్నో 'ఆకాశరామన్న' ఉత్తరాలకి కాపీలు దొరికాయి. ఆయన సంజాయిషీ కోరుతూ వచ్చిన ఉత్తరం కాపీ కూడా దొరికింది.

అసలు- ఆ ఉత్తరం రాసింది కూడా నారాయణే!

తనని ఇతరులు 'ఆకాశరామన్న'గా గుర్తించారని తెలిసి, ఆ అభిప్రాయం మార్చడం కోసం తన మీదనే రాసుకున్నాడు నారాయణ. అయితే... అది ఎదురుతిరిగింది.

పాపం... అనుకోకుండా పట్టుబడిపోయాడు 'ఆకాశరామన్న.'

*- జాగృతి వార పత్రిక... 7-13 జనవరి '91*